"ఎంత ఆలోచించినా, ఏవైపు నుంచి సమస్యను పరిశీలించినా నువ్వు మళ్లీ ప్రయత్నం చెయ్యడమే మంచి దనిపిస్తున్నదోయ్ రాజశేఖర్."

రాజశేఖర్ బావగారి వంక విషాదంగా చూశాడు. ఆ మాటలు వినడం అతనికి కొత్తకాదు. అతని భార్య వినీల మరణించిననాటి నుంచీ బంధువులూ, స్నేహితులూ, హితోభిలాషులూ అందరూ చెప్తున్న మాటే అది.

"వినీల గురించి ఎంతో తెలిసిన మీరు కూడా అదేమాట అనడం చాలా బాధగా ఉంది బావగారూ."

అతని బావగారు ప్రసాద్ నిట్టూర్చాడు. అతని కళ్లముందర వినీల రూపం కదలాడింది. రాజశేఖర్ వినీలను ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. ప్రేమ వివాహమైనప్పటికీ వినీల ఇంట్లో అందరి అభిమానాన్ని చూరగొంది. తనకు కూడా సొంత చెల్లెళ్ళు లేని లోటుని తీర్చింది. అటువంటి వినీల బాత్రూంలో స్నానం చేస్తూ గీజర్ స్విచ్ఛి తడిచేత్తో ఆపబోయి షాక్‌కొట్టి చచ్చిపోయింది. నలభై ఏళ్ళు నిండకుండానే నూరేళ్లూ నిండిపోయాయి. కూతురువీణ మెడిసన్ చదువుతోంది. కొడుకు జయంత్ ఇంటర్మీడియట్‌లో ఉన్నాడు. వినీల మరణాన్ని ఎవరూ తట్టుకోలేకుండా ఉన్నమాట వాస్తవమే. కానీ భవిష్యత్తు విషయం ఆలోచించాలి కదా.

"వినీలను మర్చిపోవడం కష్టమే. కానీ నువ్వు పిల్లల విషయం ఆలోచించాలి."

"వాళ్ళేమైనా పాలుతాగే పసిపాపలా? ఇద్దరూ పెద్దవాళ్ళే. అమ్మాయి ఎలాగూ హాస్టల్లోనే ఉంది. అబ్బాయీ కొన్నాళ్ళయితే హాస్టల్‌కి వెళ్లిపోతాడు."

"పాలుతాగే వయస్సులో ఎంత సంరక్షణ అవసరమో, ఈ ఫార్మేటివ్ ఇయర్స్‌లోనూ అంతే అవసరం. ఈ కాలపు పిల్లల జీవితంలో టీనేజ్ చాలా ముఖ్యమైన స్టేజి. వాళ్లకి చెడిపోవడానికి ఎన్నో మార్గాలు ఇప్పడే తెరుచుకుంటాయి. హాస్టల్లో ఉంటే మాత్రం అమ్మాయి సెలవులకు ఇంటికి రాదా? అంతకన్నా ముఖ్యంగా జయంత్ విషయం ఆలోచించు. అసలే తల్లిపోయిన దుఃఖంలో ఉన్నాడు. నువ్వు నెలలో మూడువారాలు టూర్లమీద ఉంటావు. ఒక్కడూ ఉంటే మనస్సులో ఎన్నిచెడు ఆలోచనలు వస్తాయో తెలుసా? "ఇంటికెళ్ళి ఏం చేస్తావు. మాతోరా" అని ఫ్రెండ్స్ పిలిస్తే వెళ్లాలనే అన్పిస్తుంది. ఎందుకని? ఇంట్లో ఎవరూ లేదు కనుక."

"అంతే కాదు తమ్ముడూ. ఇంకో అయిదారేళ్ళల్లో పిల్లల చదువులయిపోతాయి. వాళ్ళకి ఉద్యోగాలు వస్తాయి పెళ్లిళ్లయి బాధ్యతలు ఏర్పడతాయి. అప్పడు నీకు తోడు చాలా అవసరం" రాజశేఖర్ అక్క లక్ష్మి అంది.

"నా పిల్లల భవిష్యత్తుకోసం ఒక అమాయకురాలి గొంతు కొయ్యాలా?"

రాజశేఖర్ వైపు చూస్తూ ప్రసాద్ ఫక్కున నవ్వాడు.

"లక్ష్మీ మీ తమ్ముడింకా వంద సంవత్సరాల క్రిందట కన్యాశుల్కం నాటకకాలంలో ఉన్నట్లున్నాడు. ఏమయ్యా, ఇదేమైనా లుబ్ధావధాన్లు బుచ్చెమ్మ చెల్లెల్ని పెళ్లి చేసుకుందామనుకున్నట్లుగా అనుకుంటున్నావా? వరకట్నం ఇచ్చుకోలేక ఎందరో అమ్మాయిలు వృద్ధ కన్యలుగా మిగిలిపోతున్నారు. అలాంటి వాళ్ళనే ఎంపిక చేద్దాం. అమాయకురాలి గొంతుక కొయ్యడం కాదు. ఒక అభాగిని జీవితాన్ని ఉద్ధరించడమే నువ్వు చేసేది".

ప్రసాద్ చెప్పింది రాజశేఖర్‌కి నచ్చింది. వినీల గురించిన ఆలోచనలే అతని మనస్సులో మెదల్తున్నాయి. కొడుకు జయంత్ ఎక్కడ పెడదారి పడతాడోనన్న భయంతో అతను పునర్వివాహానికి అంగీకరించాడు.

ప్రసాద్ పేపర్లో ప్రకటన వేయించడానికి, పదిమందితో చెప్పడానికి ప్రయత్నం ప్రారంభించాడు.

❖ ❖ ❖

పేపర్లో ప్రకటనకు చాలా ఉత్తరాలొచ్చాయి. తెల్సిన వాళ్ళు కూడా చాలా సంబంధాలే చెప్పేరు.

లక్ష్మి, ప్రసాదు మేనల్లుడికీ, మేనకోడలికీ మెల్లిగా వాళ్ళ తండ్రి మళ్ళీ చేసుకోవలసిన అవశ్యకతను తెలియజేశారు. ఈ వివాహం వాళ్ళ భవిష్యత్తుకి అటంకం కానీ, వాళ్ళ తల్లి స్మృతి పట్ల అగౌరవం కానీ కాదని నచ్చచెప్పేరు.

ఇప్పటి పిల్లల మనుస్సులు చదువులవల్లనో, టి.వి. సినిమాల వల్లనో కానీ చాలా తొందరగానే వికసిస్తున్నట్లున్నాయి. ప్రసాద్‌కీ, లక్ష్మికీ పిల్లల్ని ఒప్పించడం అనుకున్న దానికన్నా సులభంగానే అయింది.

❖ ❖ ❖

వచ్చిన సంబంధాలలో సుచిత్ర అనే అమ్మాయి వివరాలు లక్ష్మికి నచ్చాయి. నలుగురు ఆడపిల్లలలో పెద్దపిల్ల. బి.ఏ. చదివింది. ఏదో చిన్న ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. వయస్సు ముప్పై అయిదేళ్ళట. తరువాత అమ్మాయిల్లో ఒకమ్మాయికి పెళ్ళయిందట.

లక్ష్మి, ప్రసాదు, రాజశేఖర్ పెళ్ళి చూపులకి వెళ్ళేరు. అతిథిమర్యాదల తర్వాత అమ్మాయిని తీసుకొచ్చి కూచోబెట్టేరు.

రాజశేఖర్‌కి ఇబ్బందిగా ఉంది. అతను వినీలను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడు ఈ వయస్సులో పెళ్ళి చూపులకి రావడం ఏమిటోలా ఉంది.

అతను తల ఎత్తి సుచిత్రను చూశాడు. ఎంత వద్దనుకున్నా వినీల అతని కళ్ళముందు మెరిసిమాయమైంది. ఛ ఇంక వినీల గురించిన ఆలోచన తగ్గించుకుని ఈమెకు న్యాయం చెయ్యాలి.

"అమ్మాయిని ఏమైనా అడగచ్చు." వినయంగా అన్నాడు వధువు తండ్రి.

రాజశేఖర్ నిస్సహాయంగా అక్కవంక చూశాడు.

లక్ష్మి మర్యాదకు రెండు ప్రశ్నలు వేసింది. తరువాత తమ్ముడి గురించిన వివరాలు చెప్పింది. అతనికి ఇక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ అయిందనీ, మొదటి భార్య పిల్లలనే తన పిల్లలుగా చూసుకోవలసి ఉంటుందనీ చెప్పింది.

ఆడపెళ్ళివారు వెంటనే అంగీకరించారు.

పెళ్ళి సింపుల్‌గా గుళ్ళో అయితే బావుంటుందన్న రాజశేఖర్ సూచనను మాత్రం వారు ఒప్పుకోలేదు.

"బాబూ, అమ్మాయి పెళ్ళి పదిమందిలో సరదాగా చేసుకోవాలన్న మా ముచ్చటను కాదనకండి."

నిజమే తనకు తప్పనిసరై చేసుకుంటున్న ద్వితీయం. ఆ అమ్మాయి పెళ్ళి గురించి ఎన్నో కలలు కని ఉంటుంది. ఎలా కాదనడం?

మంచి ముహూర్తాన సుచిత్ర రాజశేఖర్ ఇల్లాలయింది.

❖ ❖ ❖

తెల్లని దుప్పటిపై మల్లెపూలు చల్లి అలంకరించిన మంచం మీద కూర్చుని ఉన్నాడు రాజశేఖర్, తనకెందుకంత టెన్షన్‌గా ఉందో అతనికి అర్థం కావడం లేదు. కొత్తగా పెళ్ళైన కుర్రవాళ్ళకి తామెక్కడ ఫెయిలవుతామోనన్న భయం ఉండవచ్చు. ఇరవై సంవత్సరాలకు పైగా సంసారం చేసిన తన కెందుకీ టెన్షన్ ?

అసలిలా శోభనం ఏర్పాట్లు జరగడమే తనకిష్టంలేదు. తను వద్దన్నప్పుడు ఆడ పెళ్ళివారు తన కాళ్ళు పట్టుకున్నంత పని చేశారు. మా సరదాలు కాదనవద్దంటూ ప్రాధేయపడ్డారు. ఎలా కాదని చెప్పాలో తనకీ తెలియలేదు. తలంబ్రాలలో బంతులాటలలో, బిందెలో ఉంగరం తియ్యడంలో సుచిత్ర ఎంతో ఉత్సాహంగా పాల్గొంది. ఎంతో కాలంగా ఎదురుచూసిన వివాహమహోత్సవం ఆమెకు. ప్రతి కన్నెపిల్లా తొలిరేయి గురించి ఎంతగానో ఊహించి ఉంటుంది. సుచిత్ర మనస్సును అర్థం చేసుకునే ప్రయత్నంలోనే తను సరేనన్నాడు. ఇప్పుడెందుకో గుండె వేగంగా కొట్టుకుంటోంది.

"ఏమిటంతగా ఆలోచిస్తున్నారు?" సుచిత్ర పిలుపుతో ఈలోకంలోకి వచ్చిన ఆమె వంక చూశాడు. తెల్లని చీరా, మల్లెపూలా, చేతిలో పాలగ్లాసూ సుచిత్ర కళ్ళు చిలిపిగా నవ్వుతున్నాయి.

తన పిల్లల కోసమే పెళ్ళి చేసుకున్నప్పటికీ ఈమెను సుఖ పెట్టడం తన బాధ్యత అనుకున్నాడు రాజశేఖర్.

మెల్లిగా ఆమె చేతిలోని గ్లాసును అందుకుని టేబిలు మీద ఉంచి, ఆమె చుట్టూ చెయ్యి వేశాడు. ఆమె వెంటనే అతన్ని పెనవేసుకుపోయింది.

తొలిరేయి నాడు తలకూడా పూర్తిగా ఎత్తడానికి సిగ్గుపడ్డ వినీల అతని మనస్సులో మెదిలింది. బలవంతంగా వినీల రూపాన్ని మనస్సులోంచి తొలగించేసి, సుచిత్రను మంచం మీద పడుకోబెట్టి నెమ్మదిగా ఆమె బుగ్గను చుంబించబోయాడు ఆమె తన పెదవులనే అందించింది ...

అరగంట తర్వాత అలసటగా నిద్రపోతున్న సుచిత్రను చూస్తున్న రాజశేఖర్‌కి మనస్సులో ఏదో గుబులుగా అన్పించింది. ఎంత వద్దనుకున్నా అతని మనస్సులో వినీల రూపమే మెదుల్తోంది. ఎంత సిగ్గుపడింది వినీల. తల వంచుకుని, కళ్ళు దించుకుని తను ఆమెకేసి చూస్తూనే ముడుచుకుపోయే ఆమె ముగ్ధత్వం తనసెంతగా మురిపించిందో.

తిరిగి అటువంటి ముగ్ధను రంజింపచేయగలనా అని తను భయపడ్డాడు. కానీ సుచిత్ర మొదట్లోనే ఎంత ఆర్తిగా పెనవేసుకుపోయింది. ఈమెకు తొలిరేయి అన్న భయమూ, సిగ్గూ ఏమాత్రం లేవేమిటి?

తన ఆలోచనలకు తన మీద తనకే కోపం వచ్చింది రాజశేఖర్‌కి. ఈ విధంగా చనిపోయిన భార్యనూ, ఈమెనూ పోల్చడమంత అమానుషత్వం ఇంకోటి లేదు. వినీలకు వివాహం నాటి వయస్సు ఇరవై ఏళ్ళు. సుచిత్రకు ముప్పై అయిదుకు పైనే ఉన్నాయి. ఎంతోకాలంగా కోరికలతో వేడెక్కి ఉన్న శరీరం. చల్లారే అవకాశం ఇంత కాలానికి దొరికింది. ఆ ఆనందసమయంలో ఆమె చొరవ చూపడంలో తప్పేమిటి? ఎన్నో సంవత్సరాలుగా మనస్సులో అణగదొక్కిన ఆశలు అవకాశం దొరగ్గానే పురివిప్పి నాట్యమాడేయి.

ఆ ఊహ మనస్సులోకి రాగానే రాజశేఖర్ హాయిగా నిద్రపోయాడు.

❖ ❖ ❖

పిల్లలు తండ్రి పెళ్ళి చూడకూడదన్న సంప్రదాయాన్ని అనుసరించి వీణా, జయంత్ ఇంట్లోనే ఉండిపోయారు.

గుమ్మంలో అడుగు పెట్టిన రాజశేఖర్, సుచిత్రలకు అతని అక్క లక్ష్మి మంగళారతి ఇచ్చింది.

రాజశేఖర్ ఇబ్బందిగా పిల్లలను సుచిత్రకు పరిచయం చేశాడు.

"చిత్రా అమ్మాయి వీణ మెడిసన్ చదువుతోంది. జయంత్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు" అని పిల్లలతో "ఈమె సుచిత్ర. మీ .... " అని ఆగిపోయాడు. వాక్యం ఎలా పూర్తి చెయ్యాలో అతనికి తెలియలేదు.

"మీరు ఏమని పిల్చినా పలుకుతాను. ఆంటీ అన్నాసరే. పిన్నీ అన్నాసరే మీ ఇష్టం."

పిల్లలిద్దరూ ఏకకంఠంతో "హలో ఆంటీ" అన్నారు. లక్ష్మి, రాజశేఖర్‌తో "కొన్నాళ్ళకి కానీ కొత్తపోదు. నువ్వు వర్రీకాకు" అంది.

❖ ❖ ❖

రాజశేఖర్ సుచిత్రతో "జయంత్ జీవితంలో చాలా ముఖ్య ఘట్టం జరుగుతోంది. ఈ సమయంలో అనుక్షణం కని పెట్టుకుని ఉండాలి. నీ ప్రస్తుత ఉద్యోగం మానేస్తే మంచిదనుకుంటున్నాను. నాది టూరింగ్ జాబ్. జయంత్ కూడా హాస్టల్‌కి వెళ్ళిపోయాక నీకు మా కంపెనీలోనే జాబ్ వేయిస్తాను" అన్నాడు.

అప్పుడే యవ్వనంలో అడుగుపెడుతున్న జయంత్‌ని పరీక్షగా చూసింది సుచిత్ర.

"మీరు చెప్పిన మాట నిజమే. అయినా నాకు జాబ్ మీద పెద్ద ఇంటరెస్ట్‌లేదు. ఏదో గత్యంతరం లేక చేశానంతే. నాకు సంసార జీవితమే ఇష్టం."

రాజశేఖర్ తృప్తిగా నిట్టూర్చాడు.

❖ ❖ ❖

కాంపుకెడుతున్న రాజశేఖర్‌తో "త్వరగా వచ్చేస్తారు కదూ. మీరులేకపోతే నాకస్సలు పొద్దుపోదు". అంది సుచిత్ర.

వారి వివాహమయ్యేక అతను వెడుతున్న మొదటి టూరు అది.

"వీలైనంత త్వరలో వచ్చేస్తాను. కొంచెం జయంత్‌ని కనిపెట్టి ఉండు."

ఆమె ముఖంలో కొద్దిగా నీలినీడలు కన్పించినట్లనిపించి, "నీ కోసం ఏ బహుమతి తెస్తానో ఊహిస్తూ ఉండు. నీకు టైం తొందరగా గడిచిపోతుంది" అన్నాడతను.

"జయంత్ చదువు నెగ్లెక్ట్ చెయ్యకు" అంటూ ఆఫీసు జీపు ఎక్కేడతను.

❖ ❖ ❖

టూర్ నుంచి తిరిగి వచ్చిన రాజశేఖర్ సుచిత్ర చేతిలో పాకెట్టుంచాడు. ఆమె విప్పి చూసింది. కొత్త డిజైనులో వస్తున్న పట్టుచీర.

"ఓ లక్ష్లీ" అంటూ చీరను గుండెకి హత్తుకుంది.

"ఇదిగో జయంత్ నువ్వడిగిన పుస్తకం" అంటూ కొడుక్కిచ్చాడు. జయంత్ ముఖంలో అనుకున్నంత ఉత్సాహం కన్పించలేదు.

కారణమేమై ఉంటుంది? తల్లిని మర్చిపోలేక పోతున్నాడేమో. తను కొత్తగా పెళ్ళి చేసుకుని తీసుకొచ్చిన ఆవిడ కొడుక్కి తల్లి లేనిలోటు తీర్చగలదా? తనే కొంత శ్రద్ధ తీసుకోవాలి.

"అన్నట్లు చెప్పడం మర్చిపోయాను, జయంత్ రేపు ఫుట్‌బాల్ మ్యాచ్ ఉందట. మనిద్దరమూ వెడదాం. రేపు ఆదివారమేగా."

"అలాగే డాడీ" ఫుట్‌బాల్ మ్యాచ్ అంటే ఎగిరిగంతేసే కొడుకు అంత నీరసంగా జవాబు చెప్పడం రాజశేఖర్‌కి నిస్సారంగా అన్పించింది. తల్లిని మర్చిపోవడానికి టైం పడుతుంది అని తనకి తాను చెప్పకున్నాడతను.

❖ ❖ ❖

రోజులు గడుస్తున్నాయి. జయంత్ చదివే కాలేజీ ప్రిన్సిపాల్ నుంచి ఒకసారి వచ్చి తనను కల్సుకోమని రాజశేఖర్‌కి పిలుపు వచ్చింది.

రాజశేఖర్ ఏమై ఉంటుందా అని ఆశ్చర్యపడ్డాడు. వెళ్ళి అడిగితే తెలుస్తుంది కదా అనుకుంటూ కాలేజికి వెళ్ళేడు.

ప్రిన్సిపాల్‌తో రాజశేఖర్‌కి పరిచయమిదివరకే ఉంది.

"చూడండి మిస్టర్ రాజశేఖర్, మా కాలేజిలో జయంత్‌ని చేర్చుకున్నప్పుడు మేము అతని మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. ఇంటర్మీడియట్‌లో స్టేటురాంకు వస్తుందనీ, మా కోచింగ్‌లో అతను ఐ.ఐ.టి.కి సెలెక్టు అవుతాడనీ అనుకున్నాం."

నిజమే జయంత్ చాలా బ్రిలియంట్ స్టూడెంట్.

కానీ ఈ మధ్య అతని పెర్ఫార్మెన్స్ చాలా పూర్‌గా ఉంది. అసలు ఇంటర్మీడియట్ పాసవుతాడా అన్పిస్తోంది".

టూరింగ్ జాబ్ మూలాన తనకు జయంత్ చదువు అంతగా పట్టించుకోవడం కుదరదు. వినీల ఉంటే కొడుకు చదువేలోకంగా ఉండేది. సుచిత్రకు అంత ఇంటరెస్ట్ చూపించాల్సిన అవసరం లేదేమో.

"మీకు తెలియనిదేముంది సార్. జయంత్ తల్లి ఈమధ్యనే పోయింది. ఆ దుఃఖం నుంచి ఇంకా తేరుకోలేదేమో. నేను పరీక్షల ముందు రెండు నెలలు శలవు పెట్టి చదివిస్తాను."

"అంతవరకూ ఆగేలా పరిస్థితి లేదేమో. జయంత్ ఎందుకో కానీ చాలా డిప్రెస్డ్‌గా ఉంటున్నాడు. తల్లిపోయిన దుఃఖం అయి ఉండదు. పిల్లలు మనమనుకున్న దానికన్నా షాకుని బాగా అబ్జార్బ్ చేసుకోగలరు."

జయంత్‌కి వేరే బాధ ఏముంటుంది? చిన్న పిల్లలయితే సవతి తల్లి సరిగా అన్నం పెట్టడం లేదనో, కొడుతుందనో, వాతలు పెడుతుందనో అనుకోవచ్చు. కానీ జయంత్‌ది అటువంటి వయస్సుకాదే.

❖ ❖ ❖

ఇంటికొచ్చిన తర్వాత రాత్రి రాజశేఖర్ జయంత్‌ని పిల్చాడు. సుచిత్ర అతని పక్కనే కూర్చుని ఉంది. మెడికల్ కాలేజిలు స్ట్రైకు మూలాన వీణకూడా ఇంట్లోనే ఉంది. రాజశేఖర్ నెమ్మదిగా జయంత్‌తో మాట్లాడేడు.

"జయంత్ ఈరోజు మీ ప్రిన్సిపాల్‌ని కలిశాను. నీచదువు స్టాండర్డు పడిపోయిందన్నారు. రాంకు రావలసిన కుర్రాడు దిగజారిపోతున్నాడన్నారు."

జయంత్ మాట్లాడలేదు.

"నాకు చాలా ఆందోళనగా ఉంది. మీ అమ్మ లేని లోటుని నేను ఊహించగలను. కానీ వీణదీ అదే పరిస్థితి కదా. ఈ మధ్య నీ స్నేహితుల్లో ఏమైనా మార్పు వచ్చిందా? చెడు సావాసాలవల్ల దుష్ఫలితాలే ఉంటాయి."

"లేదు డాడీ ఇదివరకటి ఫ్రెండ్సే."

"మీ అంటీ నీకు తిండి దగ్గరకానీ, సదుపాయాల దగ్గరకానీ లోటు చేస్తోందా?"

ఒకసారి సుచిత్రవైపు చూసి జయంత్ "లేదు డాడీ" అన్నాడు.

"మరి నీ ప్రాబ్లెం ఏమిటి? నాకు చెప్తే నేను ఏమైనా చెయ్యగల్గుతాను."

జయంత్ ఎంత అడిగినా ఏమీ చెప్పలేదు.

ఆ రాత్రి రాజశేఖర్ ఆలోచనలతో నిద్రపోలేదు.

❖ ❖ ❖

మర్నాడు ఒంటరిగా కూర్చున్న రాజశేఖర్‌తో వీణ "డాడీ, తమ్ముణ్ణి మనం సైకియాట్రిస్టుకి చూపిద్దాం. మనకన్నా వాళ్ళు సమస్యల్ని బాగా అర్థం చేసుకుని, చక్కటి పరిష్కారాలివ్వగలరు" అంది.

రాజశేఖర్ సరే అన్నాడు.

విషయం విన్న సుచిత్ర ముఖం చిట్లింది "పిచ్చి ముదిరిన వాళ్ళకి కానీ మన జయంత్‌కి సైకియాట్రిస్టు ఎందుకు?" అంది.

రాజశేఖర్ ఆమె మాట పట్టించుకోలేదు.

❖ ❖ ❖

ఎదురు మనిషి హృదయంలోకి చొచ్చుకుపోయేలా మాట్లాడగలగడం సైకియాట్రిస్టులకి వృత్తి నేర్పిన విద్య ఇంట్లో అత్యంత ఆప్తులకు కూడా చెప్పని విషయాలు సైకియాట్రిస్టుల దగ్గర నిస్సంకోచంగా చెప్పగలం.

జయంత్ విషయంతో అదే జరిగింది. అతను చెప్పిన విషయం ఎందరో పేషంట్ల నుండి ఎన్నో రకాల విషయాలు విన్న సైకియాట్రిస్టుని కూడా దిగ్భ్రాంతిలో పడేసింది.

నిజంగా ఇలా జరుగుతుందా అసలు ..................

❖ ❖ ❖

ఒంటరిగా కూర్చున్న జయంత్ దగ్గరకు సుచిత్ర వచ్చింది.

"ఏం బాబూ దిగులుగా ఉన్నావు? అమ్మ గురించి ఆలోచిస్తున్నావా? నీకు నేనున్నానుగా" అంటూ దగ్గరకు తీసింది.

జయంట్ ఉక్కిరి బిక్కిరయ్యాడు. అప్పుడప్పుడే మీసాలు వస్తున్న వయస్సతనది. ఎప్పుడైనా తల్లి దగ్గరకు తీసుకున్నా తండ్రి "పాలుతాగే పసి పిల్లాడనుకుంటున్నావా?

ంత పెద్దవాడయ్యాడని గుర్తించి, స్నేహితుడిలా ట్రీట్ చెయ్యి" అనేవాడు.

అలాంటిదిప్పుడు ఈ పరాయి స్త్రీ ఎంత తల్లి స్థానంలో వచ్చినా తనను దగ్గరకు తీసుకోవడమేమిటి?

"మీ నాన్నగారు లేరని బెంగగా ఉందా" అంటూ గుండెకు హత్తుకుంది.

"పద కాస్సేపు సినిమా చూద్దాం. నీకు హుషారు వస్తుందేమో. మా ఫ్రెండుని అడిగి కాసెట్ తెచ్చాను" అంటూ కాసెట్ వి.సి.ఆర్‌లో పెట్టి టి.వి., వి.సి.ఆర్. ఆన్ చేసింది.

సోఫాలో అతని పక్కగా కూచుంది. ఆమె శరీరం అతని భుజానికి తగుల్తోంది.

సినిమాలో హాట్ సీన్ నడుస్తోంది. జయంత్ ఒళ్ళు వేడెక్కిపోయింది. కొత్తగా యవ్వనం వస్తున్న వయస్సది. అతనిలో కోరిక హిమాలయమంత ఎత్తు ఎదిగింది. ఆమె చేతులు చాచి, అతన్ని మీదకు లాక్కుని తనలో కలుపుకుంది.

అంతా పూర్తయ్యాక "ఈ సంగతి ఎవరికీ తెలియకూడదు సుమా" అంది.

కోరికను జయించలేని వయస్సు ఒకవైపూ, తప్పు చేస్తున్నానన్న బాధ ఒకవైపూ అతన్ని నిలువునా దహించి వేస్తున్నాయి.

❖ ❖ ❖

విషయం విన్న సైకియాట్రిస్టు ముందు స్థాణువైపోయాడు. తరువాత అతనికి తన వృత్తి ధర్మం జ్ఞాపకం వచ్చింది.

"డోన్ట్‌వర్రీ మై బాయ్. యూ విల్ బి ఆల్ రైట్ సూన్" అన్నాడు.

సైకియాట్రిస్టు ద్వారా విషయం తెలిసిన రాజశేఖర్ అచేతనంగా నిలబడి పోయాడు. అతనికి కళ్ళు తిరిగినట్లనిపించింది.

పిల్లల భవిష్యత్తుకోసం పెళ్ళి చేసుకున్నాడు. ఒక పసిపిల్ల జీవితం నాశనం చెయ్యకూడదనుకుని మధ్య వయస్సు వచ్చిన స్త్రీనే వివాహం చేసుకున్నాడు. కానీ ఆ శ్రద్ధ తన కొడుకునే నాశనం చేస్తుందనుకోలేదు.

అతనికి అకస్మాత్తుగా సుచిత్రతో గడిపిన తొలిరేయి జ్ఞాపకం వచ్చింది. ఎంత చొరవగా, ఎంత అనుభవమున్నదానిలా ప్రవర్తించింది. అణగారిన కోరికలు ఒక్కసారిగా బుసకొట్టి పైకి వచ్చాయనుకున్నాడే కానీ ఆశ మదిలో మెదిలిన మరుక్షణం కోరిక తీర్చుకోగల సత్తా ఉందనుకోలేదు.

చివరకు కొడుకు వరసయిన వాడితో కూడానా?

రాజశేఖర్‌కి తల తిరిగినట్లనిపించింది.

"మీ అబ్బాయి మనస్సుకి కలిగిన గాయాన్ని త్వరలో నయం చేసి, అతను చదువుపైకి దృష్టి సారించేలా చేస్తాన"న్న సైకియాట్రిస్టు మాటలు గానీ,

"మాడర్న్ మెడిసన్‌కి సాధ్యం కానిది లేదు. వర్రీ కాకండి డాడీ" అన్న వీణ మాటలు కానీ అతనికి ఓదార్పునివ్వలేదు.

(మయూరి)